సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 21 । జనవరి । 2025



కళాశాలలకు జరిమానా..

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న 14 ప్రైవేటు కళాశాలలకు రూ.లక్ష జరిమానా విధించారు.

వివరాలు 8లో ▸



వైభవంగా బ్రహ్మోత్సవాలు

ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

వివరాలు 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
36.1 /13.1

వాతావరణం

ఆకాశం అప్పుడప్పుడు మేఘావృతమై ఉంటుంది. ఉదయం, రాత్రి సమయంలో చల్లని గాలులు వీస్తాయి. చలి ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

స్పౌజ్ బదిలీలకు మోక్షం

- మహబూబ్‌నగర్ జిల్లాలో 132 మంది బదిలీకి అవకాశం
- నేడు ఆర్డర్స్ ఇవ్వనున్న అధికారులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ఉద్యోగుల విభజన చేసేందుకు ప్రభుత్వం 2021లో జీఓ 317 ద్వారా ఉద్యోగులను ఉమ్మడి జిల్లాలోని పలు జిల్లాలకు బదిలీలు చేశారు. ఈ క్రమంలో స్పౌజ్ (భార్యాభర్తలు) ఒకచోటి నుంచి మరో చోటికి బదిలీ కావడంతో ఇబ్బంది మొదలైంది. ఈ క్రమంలో మొదట రాష్ట్రవ్యాప్తంగా బదిలీకి ప్రభుత్వం అవకాశం ఇచ్చినా 13 జిల్లాలకు బదిలీ ప్రక్రియను నిలిపివేయగా అందులో ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని 5 జిల్లాలు సైతం ఉన్నాయి. దీంతో బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. అనంతరం బదిలీలు చేయాలని ఉపాధ్యాయులు పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో స్పందించిన ప్రభుత్వం కేబినెట్ సబ్ కమిటీ వేసి, ఇబ్బందులు ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వివిధ స్థాయిలో పరిశీలన అనంతరం జిల్లాలకు స్పౌజ్ బదిలీలు చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఒక్క మహబూబ్‌నగర్ జిల్లాలోనే 132 మంది బదిలీకి అవకాశం కల్పించింది. ఈ క్రమంలో బదిలీ అయ్యే వారికి అధికారులు మంగళవారం ఆర్డర్లు ఇవ్వనున్నట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. అయితే బదిలీల కోసం పీఆర్టీయూ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చి.. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషిచేసినట్లు పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్యాంబాబు, రమాకాంత్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

ప్రజావాణికి 85 అర్జీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలపై చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో వారికి తగు సూచనలు ఇవ్వాలన్నారు. ఈ క్రమంలో వివిధ సమస్యలపై 85 దరఖాస్తులు వచ్చినట్లు ఆమె చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మొదటిరోజు 12 వార్డులలో సభలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు వార్డు సభలు నిర్వహించనున్నామని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మొదటిరోజు మంగళవారం 12 వార్డులలో ఇవి కొనసాగుతాయని, అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వార్డు నం.1, 3 పరిధిలోని తిమ్మసానిపల్లి, అప్పన్నపల్లి రెవెన్యూ కార్యాలయాల వద్ద, నం.8లోని టీచర్స్‌కాలనీ వాటర్ ట్యాంకు, నం.12లోని హనుమాన్‌పురాలో కమ్యూనిటీ హాల్ – ఉర్దూ మీడియం స్కూల్, 16లోని బోయపల్లి రెవెన్యూ వార్డు కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు ప్రారంభిస్తామన్నారు. అలాగే వార్డు నం.21 పరిధిలోని కిరణ్ కాన్వెంట్ స్కూల్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో, 22లోని భగీరథకాలనీ కమ్యూనిటీ హాల్‌లో, 24లోని రామయ్యబౌలి అర్బన్‌హెల్త్ సెంటర్ పక్కన, 26లోని హబీబ్ నగర్ అక్బర్ మసీదు చౌరస్తా – ఎంజీ కన్వెన్షన్ హాల్‌లో, 43లోని రాంనగర్‌లో సెంట్రల్ లైబ్రరీ ప్రాంగణం, 45లోని పాతతోట కమాన్ వద్ద నిర్మిస్తున్న భవనంలో, 48లోని క్రిస్టియన్‌కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఈ సభలు నిర్వహిస్తామన్నారు. పేదలు ఆయా ప్రాంతాలకు వచ్చి కొత్తగా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

స్టేషన్ మహబూబ్‌నగర్: మైనార్టీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి శంకరాచారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 10 మైనార్టీ పాఠశాలల్లో 5వ తరగతిలో మొత్తం సీట్లకు, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన మైనార్టీ సీట్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 10 కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ఎంపీసీ, బీపీసీ, ఎంఈసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఎంఎల్‌టీ, సీఎస్, ఏటీ సీజీటీ (జనరల్, ఒకేషనల్) కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఎలాంటి రుసుం లేకుండా ఆన్‌లైన్‌లో https://tgmreistelangana.cgg.gov.in దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆఫ్‌లైన్‌లో ఆయా పాఠశాలలు లేదా కళాశాలల ప్రిన్సిపాళ్లకు వచ్చే నెల 28లోగా దనఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాల కోసం మైనార్టీ సంక్షేమ కార్యాలయం, పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లతోపాటు సెల్ నంబర్లు 73311 70874, 73311 70828, 73311 70830, 79950 57894 సంప్రదించాలన్నారు.

ముందడుగు పడేనా?!

రిజర్వు ఫారెస్టులోని రోడ్లు బీటీగా మార్చేందుకు ప్రభుత్వం పచ్చజెండా



హన్వాడ మండలం పల్లెమోనికాలనీ గ్రామ శివారులోని కొత్తచెర్వుతండాకు వెళ్లే రోడ్డు ఇది. జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ రోడ్డును బీటీగా మార్చేందుకు గతంలో పలుమార్లు అనుమతులు ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. జాతీయ రహదారి–167ఎన్ మెయిన్ రోడ్డు నుంచి రిజర్వు ఫారెస్టు మీదుగా కొత్తచెర్వుతండా వరకు 2.5 కి.మీ., ఉంటుంది. 2024 అక్టోబర్ 10న బీటీగా మార్చేందుకు రూ.3.35 కోట్లతో ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసినా ఇప్పటి వరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి అటవీ శాఖకు ప్రతిపాదనలు పంపకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదు. అటవీ శాఖ అనుమతిస్తే తప్ప ఈ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్ ప్రక్రియ పూర్తికాదు.

■ భూత్పూర్– చించోలి జాతీయ రహదారి–167ఎన్ మహబూబ్‌నగర్ సమీపంలోని రిజర్వు ఫారెస్టు మీదుగా వెళ్తుంది. అయితే అటవీ శాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో రిజర్వ్ ఫారెస్టు మీదుగా వెళ్లే దాదాపు 2.5 కి.మీ., మేర జాతీయ రహదారి పనులు నిలిచిపోయాయి. ఈ రోడ్డు నిర్మాణంలో పోతున్న భూమికి బదులుగా మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామ శివారులో సర్వే నం.23లో ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాతే పనులు జరిగే అవకాశం ఉంది.

■ నవాబ్‌పేట ఆర్‌అండ్‌బీ నుంచి గుడిమల్కాపూర్ వరకు 3.8 కి.మీ., మట్టి రోడ్డు రిజర్వ్ ఫారెస్టు మీదుగా వెళ్తుంది. ఈ రోడ్డును గతంలో పలుమార్లు బీటీగా మార్చేందుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులిచ్చినా నిర్మాణ పనులకు ముందడుగు పడలేదు. ప్రస్తుతం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ జీఓ 610, 2024 అక్టోబర్ 10న రూ.4.50 కోట్లతో గుడిమల్కాపూర్ రోడ్డు బీటీగా మార్చేందుకు మళ్లీ పరిపాలనా అనుమతులు ఇచ్చింది. గుడిమల్కాపూర్ బీటీ రోడ్డు నిర్మాణంలో రిజర్వ్ ఫారెస్టుకు సంబంధించి 12 ఎకరాల భూమి పోతున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ భూమికి బదులుగా మహబూబ్‌నగర్ మండలం వెంకటాపూర్ రెవెన్యూ గ్రామ శివారులో సర్వే నం.23లో ప్రభుత్వ భూమిని కేటాయించేందుకు ప్రతిపాదనలు పంపారు.

- గతంలో పలుమార్లు అనుమతులిచ్చినా సాగని పనులు
- డైవర్షన్ ప్రతిపాదనలు పంపడంలో పీఆర్ అధికారుల మీనమేషాలు
- తమ దృష్టికి రాలేదంటున్న అటవీశాఖ అధికారులు
- పనులు మంజూరై మూడు నెలలు గడుస్తున్నా కనిపించని పురోగతి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లావ్యాప్తంగా మంజూరైన బీటీ, మట్టి రోడ్డు పనులు అటవీ శాఖ అనుమతులు లేక మరుగున పడుతున్నాయి. ఫలితంగా రోడ్డు మార్గం సరిగా లేకపోవడం, వన్యప్రాణుల భయంతో బిక్కుబిక్కుమంటూ గమ్యస్థానాలకు చేరుకునే పరిస్థితి ఆయా గ్రామాల ప్రజలది. అటవీ ప్రాంతంలో మట్టి రోడ్ల మీదుగా ఆయా గ్రామాలకు వెళ్లాలంటే ప్రజలు పడుతున్న ఇబ్బందులు అన్నీ ఇన్నీ కావు. బీటీ రోడ్లు మంజూరు చేయడం వరకే తమ పని అన్నట్లుగా పంచాయతీరాజ్ శాఖ వ్యవహరించడంపై ఆయా ప్రాంతాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పనులు మంజూరు చేసిన సదరు అధికారులు అటవీ శాఖ అనుమతులు కోరుతూ ప్రతిపాదనలు పంపాలి. రిజర్వ్ ఫారెస్టు గెజిట్ ప్రకారం అటవీ ప్రాంతంలోని భూమిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. ఏదైనా నిర్మాణాలు చేపట్టాలంటే డైవర్షన్‌కు దరఖాస్తు చేసుకొని అనుమతులు వచ్చాకే ముందుకెళ్లాలి. కానీ, పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖలు ఇలాంటి చర్యలు చేపట్టకపోవడంతో జిల్లాలోని అటవీ ప్రాంతాల మీదుగా వెళ్లే రహదారుల నిర్మాణాలు ముందుకు సాగడం లేదు.

సమన్వయలోపం కారణంగా..

పరిపాలన సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం తండాలు, మారుమూల గ్రామాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అయితే ఆయా గ్రామాలు, తండాలకు మండల, జిల్లాకేంద్రాలతో రవాణా సౌకర్యం మెరుగుపరిచేందుకు తీసుకుంటున్న చర్యలు కార్యరూపం దాల్చకపోవడానికి ప్రభుత్వ శాఖల సమన్వయలోపం కారణంగా కనిపిస్తోంది. జిల్లాలో చాలా హ్యాబిటేషన్ గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గాలు అటవీ ప్రాంతాల మీదుగా ఉన్నాయి. వాటన్నింటిని మెరుగుపర్చాలనే డిమాండ్ స్థానిక ప్రజల నుంచి వస్తున్నా నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడం అధికారులు విఫలమవుతున్నారు.

ఈసారైనా నిర్మించాలి..



గతంలో రెండు పర్యాయాలు బీటీ రోడ్డు మంజూరైనా నిర్మించలేదు. నవాబ్‌పేటకు వెళ్లే మెయిన్ రోడ్డు ఫతేపూర్ మైసమ్మ దేవస్థానం దగ్గర నుంచి గుడిమల్కాపూర్ గ్రామానికి అటవీ ప్రాంతంలో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉంది. ఈసారి కూడా ప్రభుత్వం బీటీ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఇప్పుడైనా రోడ్డు నిర్మించి 5 గ్రామాలకు రవాణా మార్గాన్ని మెరుగుపర్చాలి.

– బాలాగౌడ్, మాజీ సర్పంచ్, గుడిమల్కాపూర్

ఇబ్బందులు పడుతున్నాం..



గతంలో ఒకసారి బీటీ రోడ్డు మంజూరైనా పనులు చేపట్టలేదు. ఈసారి బీటీ రోడ్డు నిర్మాణమవుతుందనే ఆశగా ఉన్నాం. మా తండాకు మట్టి రోడ్డు ఉండటంతో రాత్రిపూట రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వన్యప్రాణుల భయంతో రోడ్డు సరిగా లేక అవస్థలు పడుతున్నాం.

– ఠీక్యానాయక్, కొత్తచెర్వుతండా

అధికారులు ఏమన్నారంటే..

అటవీ ప్రాంతంలోని మట్టి రోడ్లను బీటీగా మార్చేందుకు అనుమతులు మంజూరైనట్లు తెలిసింది. గుడిమల్కాపూర్, జాతీయ రహదారుల నిర్మాణాలకు సంబంధించి ప్రతిపాదనలు రాగా కలెక్టర్ చొరవతో రోడ్డు నిర్మాణంలో పోతున్న అటవీ భూమికి బదులు వెంకటాపూర్ శివారులోని సర్వే నం.23లో ప్రభుత్వ భూమిని అటవీ శాఖకు కేటాయించేందుకు చర్యలు తీసుకుంటుండగా.. కొత్తచెర్వుతండా రోడ్డుకు సంబంధించి మాకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని డీఎఫ్ఓ సత్యనారాయణ పేర్కొన్నారు.

■ రిజర్వు ఫారెస్టు మీదుగా వెళ్లే రెండు రోడ్లను బీటీగా మార్చేందుకు ప్రభుత్వం అనుమతులిచ్చింది. డైవర్షన్ కోసం అటవీ శాఖకు ప్రతిపాదించాం. అనుమతులు రాగానే టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి చెప్పారు.

గ్రామసభలకు పకడ్బందీగా ఏర్పాట్లు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర, పక్కన అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): సంక్షేమ పథకాల అమలులో భాగంగా మంగళవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న గ్రామసభలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి అధికారులతో వీసీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టబోతుందని, ఇందులో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం ఈ నెల 21 నుంచి 24 వరకు నిర్వహించే గ్రామసభలలో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందజేస్తామన్నారు. రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతర ప్రక్రియ అని, చివరి లబ్ధిదారుల వరకు అందిస్తామన్నారు. గ్రామ సభలలో ఫ్లెక్సీలు, తాగునీళ్లు, టెంట్లు, మైక్ సెట్ ఏర్పాటు చేయాలన్నా. అలాగే వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ పథకంలో కనీసం 20 రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింపజేస్తామన్నారు. గ్రామసభల నిర్వహణపై ముందురోజు గ్రామంలో టాంటాం వేయించాలన్నారు. నాలుగు సంక్షేమ పథకాల కోసం కొత్తగా వచ్చిన దరఖాస్తులకు ప్రత్యేక రిజిష్టర్లు ఏర్పాటు చేసి కుటుంబ సభ్యుల పేర్లు, ఆధార్, సెల్‌నంబర్లు తీసుకోవాలని సూచించారు.

గణతంత్ర వేడుకలపై సమీక్ష

ఈ నెల 26న గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. వేడుకల్లో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా సజావుగా జరిగేలా చూడాలన్నారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శకటాలు, స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రొటోకాల్‌ను అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావన పెంపొందేలా విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందించేందుకు జాబితా రూపొందించాలని చెప్పారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలపై లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు శివేంద్ర ప్రతాప్, మోహన్‌రావు, ఏఎస్పీ రాములు, ఆర్డీఓ నవీన్, హౌజింగ్ పీడీ వైద్యం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇచ్చి ఆదుకోవాలి



మహబూబ్‌నగర్ అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన బాధితులు

- అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన సర్వే నం.523 బాధితులు

మహబూబ్‌నగర్ రూరల్: మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని క్రిష్టియన్‌పల్లి రెవెన్యూ శివారు సర్వే నం.523లో తమ ఇంటి స్థలాలు, పట్టా సర్టిఫికెట్లు 2018 సంవత్సరంలో ప్రభుత్వానికి స్వాధీనపరిచిన వారు తక్షణమే తమకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా టీఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం ఖలీల్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అర్హులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇవ్వకుండా అనర్హులకు కట్టబెట్టారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అవినీతిపరులపై చర్యలు తీసుకొని, తమకు న్యాయం చేస్తారని బాధితులు సంబరపడ్డారని, కానీ, ఏడాది గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆందోళన చెందుతున్నారన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి జోక్యం చేసుకొని బాధితులకు న్యాయం చేయాలన్నారు. గతంలో బీఆర్ఎస్‌లో ఉండి అవినీతిపరులుగా ముద్రపడిన నాయకులు, కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరడం వల్ల తమకు న్యాయం జరగడంలో జాప్యం జరుగుతుందని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పుడు ఇంటి స్థలం ఉన్న వారికే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుందని, ఇల్లు గాని, ఇంటి స్థలం గాని లేని పేదల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలో ప్రభుత్వ భూమి వివరాలు తెలుపుతూ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ ఘాన్సీరాంనాయక్, డిప్యూటీ తహసీల్దార్ దేవేందర్‌లను కలిసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో టీపీజేఏసీ రాష్ట్ర నాయకుడు రామకృష్ణ, టీఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి యాదగిరి, నాయకులు జలాల్‌పాషా, గట్టన్న, జైపాల్, బాలకృష్ణ, గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో ప్రతిభచూపాలి

మహబూబ్‌నగర్ క్రైం: ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు కరీంనగర్‌లో జరిగే 3వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన పోలీస్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచాలని జోగుళాంబ జోన్–7 డీఐజీ ఎల్ఎస్ చౌహాన్ అన్నారు. జిల్లాకేంద్రంలోని పరేడ్ మైదానంలో సోమవారం స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన వారితో డీఐజీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. రాష్ట్రస్థాయితోపాటు జాతీయ స్థాయిలో మిమ్మల్ని మీరు నిలబెట్టుకునేందుకు మరింత కష్టపడాల్సిన అవసరం ఉందన్నారు. జోగుళాంబ జోన్ గర్వపడే విధంగా క్రీడల్లో ప్రతిభ చూపాలని కోరారు. పోలీస్ శాఖ అంటే చట్టాన్ని అమలు చేయడంతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. క్రీడలతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్పీ జానకి, ఏఎస్పీలు రాములు, సురేష్‌కుమార్, నారాయణపేట ఏఆర్ ఏఎస్పీ రియాజ్ ఉల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్

6,614 క్వింటాళ్ల వేరుశనగ రాక

జడ్చర్ల: బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం వేరుశనగ దిగుబడులు పోటెత్తాయి. వివిధ ప్రాంతాల నుంచి 6,614 క్వింటాళ్ల వేరుశనగ యార్డుకు విక్రయానికి వచ్చింది. వేరుశనగ క్వింటాల్ గరిష్ఠంగా రూ.6,569, కనిష్ఠంగా రూ.4,029 ధరలు వచ్చాయి. అలాగే కందులు క్వింటాలు గరిష్ఠంగా రూ.7,159, కనిష్ఠంగా రూ.5,800, మొక్కజొన్న క్వింటాల్ సరాసరిగా రూ.2,431, పెబ్బర్లు క్వింటాల్ సరాసరిగా రూ.6,683, ధాన్యం ఆర్ఎన్ఆర్ గరిష్ఠంగా రూ.2,590, కనిష్ఠంగా రూ.2,409, జొన్నలు క్వింటాల్ ఒకే ధర రూ.4,143 చొప్పున కేటాయించారు.

24న సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో శుక్రవారం జిల్లా సీనియర్ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్‌లో వచ్చేనెల 1, 2 తేదీల్లో రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల కబడ్డీ టోర్నమెంట్ ఉంటుందన్నారు. ఉదయం 9 గంటలకు ఎంపికలు ప్రారంభమవుతాయని చెప్పారు.

అరకొరగానే..

ప్రభుత్వం ప్రకటించిన జాబితాలో కానరాని అర్హుల పేర్లు

- ప్రజాపాలనలో 55 వేలకుపైగా దరఖాస్తులు
- తాజాగా 14,965 మందితోనే అర్హుల జాబితా విడుదల
- తెల్ల రేషన్‌కార్డులపై దరఖాస్తులదారుల గగ్గోలు
- గ్రామసభల్లో మరోసారి దరఖాస్తులకు అవకాశం



జిల్లాకేంద్రంలోని పద్మావతి కాలనీలో ఇంటింటి సర్వే చేస్తున్న రెవెన్యూ సిబ్బంది (ఫైల్)

జిల్లాలో	
మొత్తం రేషన్ కార్డులు	2,39,500
ఆహార భద్రత కార్డులు	2,20,283
అంత్యోదయ కార్డులు	19,016
అన్నపూర్ణ కార్డులు	201

మహబూబ్‌నగర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాల అమలుకు అర్హుల ఎంపికలో అంతా గందరగోళంగా మారింది. దరఖాస్తు చేసుకున్నా పేర్లు లేకపోవడంతో నిజమైన అర్హులు గగ్గోలు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించడంతో ప్రజలు సంతోషపడ్డారు. సమగ్ర కుటుంబ సర్వేలో 360 డిగ్రీల్లో పరిశీలన చేశామని, అర్హుల జాబితా రూపొందించామని ప్రభుత్వం చెబుతున్నా.. చాలామంది పేర్లు జాబితాలో లేవు. అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం సమగ్ర ఆర్థిక, రాజకీయ, కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని వారి వివరాలను సేకరించారు. కాగా గతేడాది ప్రజాపాలనలో ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు తీసుకున్న సమయంలో ప్రజలు రేషన్‌కార్డుల కోసం విడిగా దరఖాస్తు ఇచ్చారు. ఇవి సుమారు 55 వేలకు పైగా ఉంటాయని అంచనా. ప్రభుత్వం మాత్రం 14,965 మందితో జాబితా విడుదల చేసింది. తిరిగి దరఖాస్తులు తీసుకోవాలని, ప్రజాపాలన సమయంలో ఇచ్చిన వాటిని పరిగణలోకి తీసుకొని విచారణ చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయిలో రేషన్‌కార్డుల జారీ కోసం చేపట్టిన సర్వే సోమవారం ముగిసింది.

అర్హులకు నిరాశే..

రేషన్‌కార్డు కోసం ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న పేదలకు నిరాశే ఎదురైంది. గత ప్రభుత్వ హయాంలోనూ రేషన్‌కార్డులకు నోచుకోని వారు కాంగ్రెస్ ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. కానీ, కార్డుల జారీలో పరిస్థితులు గందరగోళంగా మారడంతో ఆశలు వదులుకుంటున్నారు. వేలల్లో దరఖాస్తులు ఉంటే వందల్లో రేషన్‌కార్డులు జారీ చేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఒక్కో గ్రామంలో వందకు పైగా రేషన్ కార్డులు అవసరం ఉండగా.. 5 నుంచి 10 మాత్రమే జారీ చేస్తున్నారు.

■ ఇదిలా ఉండగా.. పాత కార్డుల్లో తమ పిల్లలు, ఇతర కుటుంబ సభ్యుల పేర్లు చేర్చాలని 18,001 దరఖాస్తులు వచ్చాయి. గ్రామాలు, పట్టణాల్లో దారిద్య్రరేఖకు దిగువనున్న కుటుంబాల పేర్లు కూడా ప్రభుత్వం పంపిన జాబితాలో కనిపించకపోవడంతో వారు లబోదిబోమంటున్నారు.

ఇవీ నిబంధనలు

పంచాయతీ కార్యదర్శులు దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి వివరాలు ఆరా తీస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే వ్యక్తులకు ఏడాది వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో వారికి ఏడాదికి రూ.2 లక్షలలోపు ఉంటే అర్హతగా తేల్చారు. తరి 3.5 ఎకరాలు, మెట్ట భూమి 7 ఎకరాల వరకు ఉండవచ్చని నిబంధన విధించారు.

దరఖాస్తు చేసుకున్నా..



నాకు వివాహమై ఆరేళ్లు కాగా.. ఇద్దరు పిల్లలు ఉన్నారు. కానీ తమ కుటుంబానికి నేటికీ రేషన్‌కార్డు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలనలో కొత్త రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నా. కులగణన సర్వే కోసం వచ్చిన సిబ్బందికి రేషన్‌కార్డు లేదని చెప్పినా.. జాబితాలో నా పేరు లేదు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న మాకు అధికారులు స్పందించి రేషన్‌కార్డు జారీ చేయాలి.

– శ్రీనునాయక్, ఓబ్లాయిపల్లి తండా, మహబూబ్‌నగర్ రూరల్

పథకాలు వస్తలేవు..



రేషన్‌కార్డు కోసం కులగణన సర్వేకు అధికారులతో వివరాలు రాయించాం. పరిశీలనకు వచ్చిన వారి వద్ద ఉన్న జాబితాలో మా పేర్లు లేవు. ఈ విషయమై అధికారులను అడిగితే గ్రామసభలో దరఖాస్తు ఇవ్వాలని చెబుతున్నారు. నాకు పెళ్లి నాలుగేళ్ల క్రితం అయ్యింది. గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. రేషన్‌కార్డు లేక బియ్యం, ఇతర ప్రభుత్వ పథకాలు రావడం లేదు.

– వెంకటేష్, మాచన్‌పల్లి గ్రామం, మహబూబ్‌నగర్ రూరల్

అర్హులందరికీ అందిస్తాం..

కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం నిర్వహిస్తున్న సర్వే పారదర్శకంగా పూర్తయింది. అర్హులకు కార్డులు అందేలా చర్యలు తీసుకుంటాం. ప్రజాపాలనలో తమకు అందిన దరఖాస్తుల పరిశీలనను తొలి విడతగా చేపట్టి ప్రభుత్వానికి నివేదిక అందిస్తాం. అర్హులై ఉండి జాబితాలో పేర్లు లేని వారు ఎవరైనా ఉంటే మంగళవారం నుంచి శుక్రవారం జరిగే గ్రామ, వార్డుసభల్లో కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ.

– వెంకటేష్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి

క్లుప్తంగా

బస్సు డ్రైవర్ అజాగ్రత్తతో మహిళ మృతి


మణెమ్మ (ఫైల్)

నారాయణపేట రూరల్: ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన నారాయణపేట మండలం సింగారం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. దామరగిద్ద మండలం వత్తుగుండ్ల గ్రామానికి చెందిన కారంపొడి మణెమ్మ (36) తన సోదరి కుమారుడిని సింగారం క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న (దామరగిద్ద) ఎస్సీ బాలుర గురుకుల పాఠశాలలో వదిలిపెట్టేందుకు వచ్చింది. అక్కడి నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు సింగారం సర్కిల్‌లో నారాయణపేట ఆర్టీసీ డిపోకు చెందిన అద్దె బస్సు ఎక్కడానికి రోడ్డు దాటుతుండగా.. డ్రైవర్ గమనించకుండా బస్సును ముందుకు కదిలించడంతో ముందు టైరు కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ భానుప్రకాష్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జిల్లా మార్చురికి తరలించారు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కాగా, తమకు న్యాయం చేయాలంటూ బాధిత కుటుంబ సభ్యులు ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించారు. వారికి గ్రామస్తులతో పాటు వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మద్దతు తెలిపారు. ఆర్టీసీ డీఎం లావణ్య, విజిలెన్స్ ఎస్‌ఐ సమక్షంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు కిందపడి వ్యక్తి..

ధన్వాడ: రామాలయం శుభ్రం చేస్తూ ప్రమాదవశాత్తు పైనుంచి కింద పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని మందిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మందిపల్లిలో రామాలయం నిర్మించి ఏడాది కావడంతో వార్షికోత్సవం కోసం ఆలయాన్ని శుభ్రం చేస్తున్నారు. వెంకటయ్య(40)తో పాటు మరో ముగ్గురు దేవాలయం పైకి ఎక్కి గోపురాన్ని శుభ్రం చేశారు. అనంతరం కిందకు దిగే క్రమంలో వెంకటయ్య ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్రగాయమైంది. హుటాహుటిన నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిశీలించిన డాక్టర్లు మార్గమధ్యలోనే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. దేవాలయం నిర్మించినప్పటి నుంచి వెంకటయ్య నిర్వహణ బాధ్యతలు చూసుకునేవాడు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం

ఎర్రవల్లి: జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన ఇటిక్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ వెంకటేష్ తెలిపిన వివరాలు.. మండలంలోని బీచుపల్లి హైవే బస్టాప్ దగ్గర ఆదివారం రాత్రి కర్నూల్ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న ఓ వాహనం గుర్తుతెలియని వ్యక్తిని ఢీకొట్టింది. ఈప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కాగా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. స్థానికులు గమనించిన పోలీసులకు సమాచారమిచ్చారు. మృతదేహాన్ని గద్వాల ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయస్సు సుమారు 40–45ఏళ్ల ఉంటాయని, కుడిచేతికి ఆకుపచ్చ దారం, ఎరుపు అంగీ, బ్లూ కలర్ పంచ ధరించినట్లు ఎస్‌ఐయ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో పంచాయతీ కార్మికుడు మృతి



మాగనూర్: మండలంలోని నేరడగం గ్రామంలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న సాయిలు(40) ఇంట్లో సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ పక్కనే ఉన్న విద్యుత్ వైర్‌ను పట్టుకుని విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు.. నేరడగం గ్రామపంచాయతీలో సాయిలు ట్రాక్టర్ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం పనులు ముగించుకొని ఇంటికివెళ్లి సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతున్న క్రమంలో పక్కనే ఉన్న ఫ్యాన్ వైర్‌ను మరో చేతితో పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అంతకు ముందు మాగనూర్ ఇన్‌చార్జీ ఎంపీవో విజయలక్ష్మి ఆధ్వర్యంలో ప్రభుత్వం నుంచి మృతుని అంత్యక్రియల నిమిత్తం రూ.10వేలు అందజేశారు.

ముగ్గురికి రిమాండ్

చిన్నచింతకుంట: మండలంలోని మద్దూర్ గ్రామంలో జరిగిన దాయాదుల ఘర్షణలో ముగ్గురిని రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ ఆర్.శేఖర్ తెలిపారు. నెలరోజుల క్రితం గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు వెంకటన్న, భాగ్యమ్మపై వారి దాయాదులు సద్దలి అంజన్న, సద్దలి సంజీవ, అనిల్ దాడిచేసి గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని.. నిందితులను సోమవారం మహబూబ్‌నగర్ కోర్టులో హాజరు పరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రైవేట్ కళాశాలలకు జరిమానా



ఉమ్మడి జిల్లాలో మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న వాటికే..

- రూ.లక్ష చెల్లిస్తేనే గుర్తింపునిచ్చే అవకాశం
- సందిగ్ధంలో యాజమాన్యాలు, విద్యార్థులు
- ప్రభుత్వ కళాశాలల నుంచి అనుమతించే యోచనలో ప్రభుత్వం



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లాలోని మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న ప్రైవేటు జూనియర్ కళాశాలలు గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ప్రతి ఏటా ప్రవేశాలు తగ్గుముఖం పడుతుండగా.. తాజాగా సంవత్సర గుర్తింపు రాకపోవడం మరో సమస్యగా మారింది. ప్రధానంగా మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో కొనసాగుతుండటం, ఫైర్ సేఫ్టీ అనుమతులు రాకపోవడం విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి ఇబ్బందిగా మారింది. ప్రభుత్వం నేడో రేపో అనుమతులు ఇవ్వకపోదా అని యాజమాన్యాలు ఇన్ని రోజులు ఎదురుచూసినా.. చివరకు పరీక్షలు సమీపిస్తున్న సమయంలో నిరాకరించడంతో పాటు విద్యార్థులను పరీక్షలకు అనుమతించాలంటే రూ.లక్ష చెల్లించాలంటూ కళాశాలల లాగిన్‌లో చూపిస్తున్నట్లు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి. కళాశాలల నిర్వహణ, భవనాల అద్దెలు భారంగా మారిన ప్రస్తుత పరిస్థితుల్లో డబ్బులు చెల్లించలేమని.. ప్రభుత్వంతో మరోదఫా చర్చలు జరపాలని భావిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా గుర్తింపురాని కళాశాలలు 21 ఉండగా అందులో మహబూబ్‌నగర్ 14, వనపర్తి 4, నారాయణపేట 2, నాగర్‌కర్నూల్ 1 ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ఒకేషనల్ జూనియర్ కళాశాలలు ఉండగా.. సుమారు 5,600 మంది విద్యార్థులు చదువుతున్నట్లు తెలుస్తోంది.

ప్రభుత్వ కళాశాలల నుంచి పరీక్షలు..

గుర్తింపు లేని కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 31 నుంచి ప్రాక్టికల్ పరీక్షలు, మార్చి 5 నుంచి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. కావున ఆయా విద్యార్థులు సమీప ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పరీక్ష ఫీజు చెల్లించే వెసులుబాటు కల్పిస్తుందని ఇంటర్మీడియట్‌శాఖలో చర్చ నడుస్తోంది. ఆయా కళాశాలల నుంచి హాల్‌టికెట్లు, మెమోలు జారీ చేసే అవకాశం ఉంది.

అనుమతులివ్వాలి..

హైదరాబాద్‌లో కొనసాగే కార్పొరేట్ కళాశాల మాదిరిగా జిల్లా, మండల కేంద్రాల్లోని కళాశాలలను పోల్చడం ఇబ్బందికరమైన విషయం. చాలామంది నిరుద్యోగ యువత కేవలం ఉపాధి కోసమే కళాశాలలు నిర్వహిస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అదనపు ఫీజులు లేకుండా ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి. పరీక్ష ఫీజులు కూడా చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

– విజేత వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ప్రైవేటు కళాశాలల సంఘం, మహబూబ్‌నగర్

రూ.లక్ష జరిమానా విధించారు..



మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ ఉన్న కళాశాలలకు ప్రభుత్వం గుర్తింపు ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లాలో 14 కళాశాలలు ఉండగా.. ప్రభుత్వం ఒక్కో కళాశాలకు రూ.లక్ష జరిమానా విధించింది. వీటలో అడ్మిషన్లు తీసుకున్న విద్యార్థులు పరీక్ష ఫీజుపై అదనంగా రూ.2,500 చెల్లించాలని సూచించింది. ఫీజులు చెల్లించని విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. గుర్తింపు ఉన్న కళాశాలల నుంచి పరీక్ష ఫీజులు వసూలు చేసి పరీక్ష రాయించే అవకాశం ఉంది. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలకు సిద్ధంగా కావాలి.

– కౌసర్ జహన్, జిల్లా ఇంటర్మీడియర్‌శాఖ అధికారి, మహబూబ్‌నగర్

విద్యార్థులకు భారం..

గత విద్యాసంవత్సరంలో ప్రభుత్వం కళాశాలలకు అనుమతులు ఇచ్చింది. గతేడాది కళాశాలలో చేరి రెండో సంవత్సరం పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేవు. ఈ విద్యాసంవత్సరం మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు సమస్యగా మారింది. ప్రభుత్వం వీరు చేరిన కళాశాలలకు గుర్తింపునివ్వకపోవడంతో పరీక్ష ఫీజులు తీసుకోలేదు. ఇటీవలే పరీక్ష ఫీజు గడువును ఈ నెల 25కు పొడిగించింది. సాధారణంగా పరీక్ష ఫీజు రూ.750 ఉండగా.. జరిమానా రూ.2,500 కలిపి చెల్లించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. సాధారణ ఫీజు విద్యార్థులు చెల్లించాని జరిమానా ఎవరు చెల్లించాలనేది ప్రశ్నగా మారింది. వీటితో పాటు ప్రైవేటు కళాశాలల్లో చదివే విద్యార్థులు సాధారణంగా రూ.200 చెల్లించాల్సి ఉంది. కానీ రూ.500 ఒక్కో విద్యార్థికి చెల్లించాలని ప్రభుత్వం సూచించింది.

సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తికి రిమాండ్


మాట్లాడుతున్న సీఐ దస్రునాయక్

కోస్గి రూరల్: సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీని, పోలీసులను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసులో వ్యక్తిని పట్టుకొని రిమాండ్ తరలించినట్లు సీఐ దస్రునాయక్ తెలిపారు. సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. మండలంలోని సర్జఖాన్‌పేటకి చెందిన కృష్ణయ్యగౌడ్ ఈనెల 9న హైదరాబాద్‌లో సీఎం, కాంగ్రెస్ పార్టీ, పోలీస్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ వీడియో తీశాడు. దాన్ని సోషల్ మీడియాలో వైరల్ చేశాడు. సర్జఖాన్‌పేట్ మాజీ సర్పంచ్ హరీష్‌గౌడ్ గ్రామస్తులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈనేపథ్యంలో ఈనెల 11న కేసు నమోదు చేసి సోమవారం అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. ఎస్‌ఐ బాల్‌రాజ్, పోలీసులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో.. రైతు ఆత్మహత్యాయత్నం


బాధిత రైతుతో మాట్లాడుతున్న తహసీల్దార్ కృష్ణయ్య

దేవరకద్ర రూరల్: తన పట్టా పొలంలో అక్రమంగా వేస్తున్న రోడ్డు పనులను నిలిపివేయాలని ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఓ రైతు ఆత్మహత్యయత్నానికి ప్రయత్నించిన సంఘటన సోమవారం దేవరకద్ర తహసీల్దార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. వివరాలిలా.. మండలంలోని చౌదర్‌పల్లికి చెందిన రామకృష్ణకు గ్రామంలోని సర్వే నం.88లో 6.6 ఎకరాల పట్టా భూమి ఉంది. అందులో నుంచి పై పొలాలకు వెళ్లేందుకు తన అనుమతి లేకుండా దారి కోసమని కొందరు మట్టి రోడ్డు వేస్తున్నారని, అడిగిన తనపై దాడి చేశారని, ఈ విషయమై పోలీసులు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే సోమవారం బాధిత రైతు తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకొని ఒంటిపై పెట్రోల్ పోసుకుంటుండగా అక్కడే ఉన్న ప్రజలు అడ్డుకున్నారు. దీంతో న్యాయం కోసం కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ విషయమై స్పందించిన తహసీల్దార్ కృష్ణయ్య మాట్లాడుతూ ఈ విషయం తన దృష్టికి ఇప్పటి వరకు రాలేదని, మోకాపైకి వచ్చి పూర్తి వివరాలు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో బాధిత రైతు ఆందోళన విరమించారు.

పురుగు మందు తాగి వ్యక్తి బలవన్మరణం


మురళీకృష్ణ(ఫైల్)

కల్వకుర్తి టౌన్: తాను నిత్యం తాగే మందులో పురుగు మందు కలుపుకొని తాగి వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మాధవరెడ్డి, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. పట్టణంలోని సుభాష్‌నగర్ కాలనీలో నివాసముండే మురళీకృష్ణ(46) ప్రైవేట్ సీడ్ కంపెనీలో ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తూ తన జీవనాన్ని సాగించేవాడు. అతను తరచూ నెలలో రెండు, మూడు రోజులు అతిగా మద్యం తాగి ఎక్కడపడితే అక్కడ పడిపోయేవాడు. రోజు మాదిరిగానే ఆదివారం రాత్రి ఇంట్లో నుంచి బయలుదేరిన అతను మద్యాన్ని కొనుగోలు చేసి, అందులో తన వద్ద ఉన్న పురుగుమందును కలుపుకొని తాగాడు. ఇంటికి సమీపంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయం వెనక భాగంలో పడిఉన్నాడు. ఉదయాన్నే అటుగా వెళ్తున్నవారు చూసి కుటుంబసభ్యులకు సమాచారమివ్వగా, వారు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. కుటుంబీకులు పోలీసులకు సమాచరమివ్వగా వారు ఘటనాస్థలికి చేరుకొని మృతదేహాన్ని పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతుడికి భార్యతో పాటు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో నగదు చోరీ

మరికల్: ఆర్టీసీ బస్టాండ్‌లో ఓప్రయాణికుడి జేబులో ఉన్న రూ. లక్ష నగదును చోరీచేసిన ఘటన మరికల్‌లో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. నర్వ మండలం మథన్‌కోడ్‌కి చెందిన రామచందర్ బంధువుల వద్ద చేసిన అప్పును తీర్చడం కోసం ఇంటి నుంచి రూ. లక్ష నగదు తీసుకొని ఆటోలో మరికల్ బస్టాండ్‌కు వచ్చారు. ఇక్కడి నుంచి కొల్లంపల్లిలో ఉన్న బంధువుల వద్దకు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. ఈ క్రమంలో అతడి జేబులో ఉన్న డబ్బులను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

వనపర్తి రూరల్: పట్టణంలోని కేడీఆర్‌నగర్ కాలనీలో తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని కేడీఆర్ కాలనీకి చెందిన మనోహర్‌రావు ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఈ నెల 18న హైదరాబాద్‌కు వెళ్లాడు. సోమవారం వనపర్తికి తిరిగి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని గుర్తించారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తాళాలు పగులగొట్టి అందులో దాచిన రూ.75 వేల నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



హ్యాండ్‌బాల్‌లో కాంస్యం

కరీంనగర్‌లో ఈనెల 18 నుంచి సోమవారం వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ అంతర్ జిల్లా హ్యాండ్‌బాల్ టోర్నీలో ఉమ్మడి జిల్లా బాలుర జట్టు మెరుగైన ప్రతిభ కనబరిచి మూడోస్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని అందుకుంది. ఈ సందర్భంగా జట్టును సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ తఖీయోద్దీన్, శంకర్‌నాయక్ అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

– మహబూబ్‌నగర్ క్రీడలు

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు


ఉమా మహేశ్వరంలో స్వామివారి పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు


పాపనాశిని గుండం వద్ద చక్రస్నానం

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మూడోరోజు సోమవారం అర్చకుడు వీరయ్యశాస్త్రి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, వసంతోత్సవం, చక్రస్నానం, పాపనాశనం వద్ద త్రిశూల స్నానాలు, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు పాపనాశిని గుండం వద్ద పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే ఆలయంలో ఉదయం గవ్యంత పూజలు, వాస్తుపూజ, వాస్తుహోమంతో పాటు అమ్మవారికి కుంకుమార్చన చేశారు. వేడుకలను ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, కార్యనిర్వహణ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షిస్తున్నారు. దర్గా వద్ద నుంచి గ్రామపంచాయతీ, ఉమమహేశ్వరం ద్వారం వరకు కాలినడకన భక్తులు తప్పా ఇతర వాహనాలను అనుమతించడం లేదు.

రంగాపురం ఉర్సులో..

రంగాపురం నిరంజన్ షావలీ ఉర్సు ఘనంగా కొనసాగుతోంది. సోమవారం భక్తులు కందూర్లు చేసి ఫాతేహాలిచ్చి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా ఆవరణలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో రద్దీ కనిపించింది.


దర్గాలో భక్తుల రద్దీ →

జాతీయ వైద్యబృందం పరిశీలన


సీహెచ్‌సీలో బ్లడ్‌బ్యాంకును పరిశీలిస్తున్న కేంద్ర బృందం, డీఎంహెచ్‌ఓ, ఆస్పత్రి అధికారులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలోని సీహెచ్‌సీని జాతీయ జనాభా పరిశోధన కేంద్ర బృందం తనిఖీ చేశారు. సోమవారం సాయంత్రం ఆస్పత్రికి చేరుకున్న తమిళనాడుకు చెందిన వైద్యులు కవిత, శక్తి మాళవిక బృందం రాత్రి వరకు రోగులకు అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే వివరాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో డెలివరీ తర్వాత ఇచ్చే జీరో డోస్, మాతా, శిశు మరణాల రేటు, వచ్చే రోగులకు సరిపడా సిబ్బంది వివరాల, బ్లడ్‌బ్యాంకులో ఉన్న రక్తనిల్వలపై వివరాలను ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రిలోని అన్ని విభాగాలను వారు నిశితంగా పరిశీలించారు. కేంద్ర బృందం వెంట డీఎంహెచ్‌ఓ స్వరాజ్యలక్ష్మి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు యశోదబాయి, విష్ణు, శివ, స్వప్న, నర్సింగ్ సూపరింటెండెంట్ శిరోమణి, నర్సింగ్ సిబ్బంది జాయ్‌మెర్సీ, బాలమణి, సునీత, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లె దవాఖానా తనిఖీ..

వెల్దండ: మండలంలోని కొట్ర గ్రామంలో పల్లె దవాఖానాను సోమవారం కేంద్ర వైద్య బృందం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈసందర్భంగా ఆస్పత్రిలోని వైద్యసేవల పనితీరు, అందుబాటులో ఉన్న మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం పల్లె దవాఖానాల ద్వారా గ్రామీణులకు మెరుగైన వైద్యం అందించడానికి కృషి చేస్తున్నట్లు ఆబృందం సభ్యులు పేర్కొన్నారు. అనంతరం కేంద్ర వైద్య బృందానికి ఇక్కడి సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. డిప్యూటీ డీఎంహెచ్‌ఓ భీమానాయక్, డాక్టర్లు మంజుభార్గవి, నవీన్‌కుమార్, సూపర్‌వైజర్లు మురళీకృష్ణ, సుమిత్ర, కవిత, ఎఎన్‌ఎంలు జాహంగీర్‌బీ, జానకి, ఎల్లమ్మ, ఫార్మసిస్టు అనిత, ఆశావర్కర్లు మంగమ్మ, లక్ష్మీబాయి, రాణిబాయి, శ్రీదేవి, పద్మ, సాయమ్మ తదితరులున్నారు.

మున్సిపల్ కార్యాలయానికి తాళం వేసి నిరసన


కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

భూత్పూర్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయానికి బీఆర్‌ఎస్ మున్సిపల్ కౌన్సిలర్లు సోమవారం తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తున్న సురేందర్‌రెడ్డి మూడు నెలల కిందట బదిలీ కాగా జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన ఎప్పుడు వస్తున్నారో.. ఎప్పుడు వెళ్తున్నారో తెలియడం లేదని, మున్సిపాలిటీలో సమస్యలు పేరుకుపోతున్నా కమిషనర్ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తూ కార్యాలయానికి తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వీధిలైట్లు, పారిశుద్ధ్య సమస్య వేధిస్తుండటంతోపాటు ట్రాక్టర్ మరమ్మతుకు గురైనా బాగు చేయించడం లేదని ఆరోపించారు. దీంతో మొక్కలకు నీళ్ల పోయడం లేదని, పార్కు ఎండిపోతోందని కౌన్సిలర్లు ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ మేనేజర్ శంకర్‌నాయక్‌తో మాట్లాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, రామకృష్ణ, జాకీర్, మురళీధర్‌గౌడ్, సత్యనారాయణ, యాదయ్య తదితరులున్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


చంద్రశేఖర్‌రెడ్డి (ఫైల్)

మానవపాడు: అప్పులబాధతో రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన మానవపాడు మండల కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ చంద్రకాంత్, కుటుంబ సభ్యుల వివరాల మేరకు.. మానవపాడుకు చెందిన రైతు చంద్రశేఖర్‌రెడ్డి (32) తనకున్న ఆరెకరాల పొలంలో పొగాకు, కందిపంట సాగుచేశారు. పంట పెట్టుబడి, కుటుంబ అవసరాల నిమిత్తం రూ. 6లక్షల దాక అప్పులు చేశారు. అయితే చేసిన అప్పులు తీర్చే దారి లేకపోవడం, వడ్డీ భారం ఎక్కువ కావడంతో మనస్థాపానికి గురై వ్యవసాయ పొలంలో పురుగు మందు తాగాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం మానవపాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అలంపూర్ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అతడికి భార్య హారిక, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైస్‌మిల్లులో ఆకస్మిక తనిఖీలు

- పీడీఎస్ బియ్యం లారీ పట్టివేత
- సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగింత

గద్వాల క్రైం: మండలంలోని ఓ రైస్ మిల్లులో గద్వాల పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేపట్టి.. మిల్లులో అనుమానాస్పదంగా ఉన్న పీడీఎస్ బియ్యం లారీని గుర్తించిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సీఐ శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని ఓ రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేస్తున్నట్లు ఫిర్యాదుల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించరన్నారు. ఓ లారీలో రీసైక్లింగ్ చేసిన బియ్యం తరలిస్తున్నట్లు అనుమానం మేరకు సదరు లారీని అదుపులోకి తీసుకుని సివిల్ సప్‌లై శాఖ అధికారులకు అప్పగించారు. ఆ శాఖ అధికారులు పరిశీలించి పీడీఎస్ బియ్యం రీసైక్లింగ్ చేసినట్లు ధృవీకరిస్తే చర్యలు ఉంటాయన్నారు. ప్రస్తుతం విచారణ చేస్తున్నామని, వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

- ఇదిలా ఉండగా.. కొన్ని రోజుల నుంచి సంబంధిత రైస్‌మిల్లు యజమానికి ప్రభుత్వం కేటాయించిన ధాన్యం ఆరుబయటే నిల్వ ఉంచినట్లు తనిఖీల్లో వెల్లడైందని తెలుస్తుంది. ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రైస్ మిల్లు యజమానులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేకుండా పోయాయి. దీంతో నడిగడ్డలో నిత్యం వందలాది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారు. పోలీసుల తనిఖీలో పట్టుబడిన సమయంలో మాత్రమే కేసులు నమోదు చేస్తున్నారు.

విచారణ జరుపుతాం..

పట్టుబడిన బియ్యం లారీని గద్వాల పోలీసులు మా దృష్టికి తీసుకువచ్చారు. అయితే ప్రస్తుతం గద్వాల మార్కెట్ యార్డ్‌లోని స్టాక్ పాయింట్ వద్దకు తరలించారు. పట్టుబడిన బియ్యం పీడీఎస్ లేదా రీసైక్లింగ్ చేసిన బియ్యం అనే విషయమై విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. – మహర్షి, సివిల్ సప్లయ్ శాఖ అధికారి